దేవి యిచ్చిన వరం

[క థా ని క]

★ శ్రీ కపిల చినవేంకటరావు ★

చలితిచంద్రుడు ఉండీ లేనట్టుగా ఉన్నాడు. గుడ్డివెన్నెలలో లోకమంతా మసక మసకగా ఉంది. శరభన్న వంట చేసుకుంటున్నాడు. పొయ్యి మండడం లేదు. పొయ్యిలోనుంచి పొగ కళ్లలోకి పోయింది. శరభన్నకి మహాకోపం వచ్చింది. లేచి నుంచుని పొయ్యిరాళ్లని ఒక్క తన్నుతన్ని, "ఎంత సేపీ వెధవవంట! భోజనం కావాలి నాకు" అన్నాడు గట్టిగా.

మరుక్షణంలో అక్కడ ఒక అరటిఆకు పరచి ఉంది, అందులో మల్లెపువ్వుల్లాంటి అన్నం, పప్పూ, నాలుగుకూరలూ, ఆరు పచ్చళ్లూ, అప్పడాలూ, వడియాలూ, పులుసూ, పరమాన్నం, భక్ష్యాలూ వడ్డించి ఉన్నాయి. శరభన్న తన కళ్లని తాను నమ్మలేకపోయాడు. తాను తప్ప ఇంకో మనిషి లేని ఈ యింట్లో ఎల్లా వచ్చింది ఈ భోజనం? ఎవరు వడ్డించారు?

అసలు మొదటినుంచీ వినండి కథ. శరభన్న తండ్రిని మీరు చూచే ఉంటారు. నూజవీడు రైల్వేస్టేషనులో చలివేంద్ర లేదూ, అక్కడ మంచినీళ్ల బ్రాహ్మణాయన. ఆయనకు బాగా వృద్ధాప్యంలో కలిగాడు శరభన్న వరప్రసాదిలాగ. రైల్వే వుకర్ల పిల్లలకుగాను ఏర్పాటుచేసిన ఒక చిన్న బడిలో విశేషకష్టంమీద తెలుగులు మాత్రం నేర్చుకున్న తర్వాత అక్కడ ఉన్న సత్రంలో గుమాస్తాపని ఖాళీ కాగా తండ్రిగారు తంటాలుపడి ఆపని చెప్పించారు శరభన్నకి.

దేశంయొక్క భారమంతా భుజాల మీద మోస్తున్న ఒక మహామంత్రికి ఉండవలసిన యోచనా నిమగ్నతా, దైహికమున్నూ, ఐహికమున్నూ అయిన ఈ తుచ్ఛ జీవనం మీద విరక్తిచెందిన మహాయోగి యొక్క పారలౌకికచింతా కనబడతాయి అతని ముఖంమీద. దానికి కారణం అతనికున్న బ్రహ్మచెవుడు.

చెవిటివాడు కావడంచేత చిన్నప్పటి నుంచీ శరభన్న తోడిపిల్లలతోటి ఆటపాటలకు వెళ్లడం ఎరుగడు. బాల్యచాపల్యంవల్ల ఒకటి రెండు పర్యాయములు అతను వెడితే తక్కినపిల్లలు అతనిని ముఖంమీదనే నిష్ఠురంగా తిట్టడం, వాళ్లలోవాళ్లు పకపక నవ్వడం సాగించారు. అదిమొదలు శరభన్న యేకాకిగానే సంచరించేవాడు. ఎవరితోనూ పని లేనిదే మాట్లాడడు. ఎవరైనా పిలిస్తే ముక్తసరిగా అడిగినదానికి జవాబు చెప్పి ఊరుకుంటాడు. ఆతని తండ్రి కాలంచేసిన కొద్దిరోజులకే తల్లి కూడా గతించింది. సత్రంలో ఒక మూల వండుకుని తింటూ డతను. మిగతా అప్పుడల్లా యేంచేస్తాడో ఎవరికీ తెలియదు. అతని సంగతే అక్కర్లేదు ఎవరికిన్నీ.

ఒకనాడు రాత్రి రైలులో వచ్చి సత్రంలో విడిసి మర్నాడు ఉదయాన్నే వెళ్లిపోయిన ఒక ఆసామీ మరచిపోయిన బాపతు 'దండకావళి' అనే పుస్తకం ఒకటి దొరికింది శరభన్నకి. అందులో అన్ని దండకాలూ పరిశీలించి తుదకు కాళిదాసుగారి శ్యామలా దండకం తనకు నచ్చగా అది వల్లనవేయడం మొదలుపెట్టి శరభన్న దానిని పూర్తిగా కంఠస్థం చేసుకున్నాడు.

ఆవేళ చవితి అని చెప్పాను కాదూ. శరభన్నకి ఎందుకో చాలా త్వరగా మెళుకువ వచ్చింది. పడుకున్న చింకిచాపమీద నుంచి ఒక్కగంతు వేసి లేచాడు. ఒళ్లు చాలా తేలికగా ఉంది. గబగబ పది దండేలూ, పది బస్కీలూ తీశాడు. జబ్బ కొట్టుకుంటూ సత్రం నూతిదగ్గరకి వెళ్లి స్నానం చేశాడు. స్నానం చేసి వచ్చేటప్పటికి శరభన్నకి శరీరంలో పుట్టిన చలాకీ ఇంతంత కాదు. ప్రపంచాన్నంతా తానొక్కడే జయించగల ననిపించింది. తన గదిలోకి వెళ్లి మూలను పెట్టిన ఒక పొట్లం విప్పాడు. కుంకుమపొట్ల మది. ఇంత కుంకుమ తీసి బొట్టు పెట్టుకున్నాడు. ఇంత కనుబొమలకి రాచుకున్నాడు. పొట్లం చేతిలో పట్టుకుని వంటగదివేపు వెళ్లాడు. వంటగది గోడమీద మసిబొగ్గుతో గీచి ఉంది ఒక పెద్దబొమ్మ—సింహంగా ఉద్దేశించబడిన భాగం ఒకటీ, దానిమీద సవారీ చేస్తున్నట్లుగా నాలుగు చేతులూ, పెద్ద తలా ఉన్న స్త్రీవిగ్రహంలాగ ఉన్న భాగం ఒకటీ. ఆ బొమ్మకి ఎదురుగా కూర్చుని శరభన్న మొదలుపెట్టాడు. "జయ జనని! సుధాసముద్రాంత హృద్యన్మణిద్వీపసంరూఢ బిల్వాటవీమధ్య కల్పద్రుమాకల్పకాంతార" అంటూ దేవీదండకం. గట్టిగా కొంతసేపూ, పైకి వినబడకుండా పెదవులతో కొంతసేపూ, కేవలం మనస్సులోనే కొంతసేపూ, ఈ విధంగా చదువుతున్నాడు. ఆకలి లేదు, దప్పిక ఎరగడు. తిండి అతనే వండుకుని తినటం కాదూ. భోజనానికి వేళైంది లెమ్మని పిల్చేవాళ్లు లేరు. ఆరోజున సత్రంలోకి ఎవరూ రాలేదుకూడాను.

ఎండ క్రమక్రమంగా పెరిగి క్రమక్రమంగా విరుగుతోంది. వచ్చేరైలు వస్తోంది, పోయేది పోతోంది. శరభన్నమాత్రం అక్కడే నిశ్చలంగా కూర్చుని దండకం పారాయణ చేస్తున్నాడు.

మధ్యాహ్నం మూడు నాలుగుగంటల మధ్య ఎవరో ఒక వృద్ధసన్న్యాసి వీరవల్లి వైపునుంచి అడ్డదారిని నడిచివచ్చి ఆయాసం చేత ఆసత్రంఅరుగుమీద కూర్చున్నాడు. ఒక్క ముహూర్తం అల్లా కూర్చున్నాడో లేదో ఆయనకి వంటయింటివేపు పోవాలని బుద్ధి కలిగింది. అటువేపు వెళ్లి చూచాడు కదా, శరభన్న ఉత్సాహంగా ఉచ్చరిస్తున్నాడు: "తస్య భద్రాసనం భూతలం, తస్య గీర్దేవతా కింకరీ, తస్య...".

ఆసన్న్యాసికి ఆశ్చర్యంకలిగింది. అక్కడే నిలబడి విన్నాడు కొంతసేపు. శరభన్న కళ్లు తెరవకుండా ద్విగుణించిన ఉద్రేకంతో చేస్తున్నాడు జపం. ఆప్రకారం వినగావినగా ఏం గోచరించిందో, తన సంచిలోనుంచి ఒక కొబ్బరికాయముక్కా, ఒక బొంత అరటిపండూ తీసి అక్కడ పెట్టి, దేశద్రిమ్మరిన్నీ, వృద్ధుడున్నూ, సర్వసంగపరిత్యాగిన్నీ

అయిన ఆ సన్న్యాసి శరభన్నకు ఒక నమస్కారం పెట్టి, నెమ్మదిగా అడుగులు పెట్టుకుంటూ అవతలికి వెళ్లి, తనదారిని తాను పోయినాడు.

శీతాకాలపుప్రొద్దు. ఇంతట్లో రాత్రైంది. ఇళ్లల్లో దీపాలు వెలిగించుకున్నారు. వెన్నెల గ్రుడ్డిగా వెలుగుతోంది. ఎక్కడో దూరంలో ఎవరో బృందం భజన చేస్తున్నారు. తాళాలూ, పాటా వినబడుతున్నాయి. కొంత సేపటికి భజన చాలించారు వాళ్లు. ప్రపంచమంతా నిశ్శబ్దమైంది.

ఆ తరుణంలో శరభన్నకు విచిత్రమైన అనుభవం కలిగింది. ఆ గోడమీద అలౌకికమైన కాంతి ఒకటి కనిపించింది అతని కళ్లకి. సింహవాహనారూఢ అయిన దేవి అతని యెదుట సాక్షాత్కరించినట్లుగా ఉంది. దేవియొక్క ముఖంలో చిరునవ్వు విరిసినట్లూ, ఆమె పెదవులు కదలుస్తూ, "ఏమిటయ్యా నీకోరిక శరభన్నా?" అని అడిగినట్లూ. తెల్లబోయి చూచాడు శరభన్న. మళ్లీ అదేమాట అడిగింది దేవి. ఇంతట్లో శరభన్నకు ఎల్లాపుట్టిందో ధైర్యం, రెండుచేతులూ మోడ్చి, తల నేలను బెట్టి "అమ్మా, నేను ఏది కావాలని కోరితే అది వెంటనే కావాలి" అన్నాడు. దేవి ఒక చేతిని ఎత్తి 'జాగ్రత్త' అన్నట్టుగా తర్జని ఊపి, ఒక్క క్షణం వరదముద్ర పట్టి మళ్లీ గోడమీద విగ్రహంలో కలిసిపోయింది. మళ్లీ గ్రుడ్డివెన్నెలా, కొద్దిగా చలీ. దూరంగా ఎక్కడో ఒక ముసిలికుక్క మోర ఎత్తుకొని ఏడుస్తోంది.

అప్పుడు కళ్లు తెరిచాడు శరభన్న. ఆకలి దహించివేస్తోంది అతన్ని. చీకట్లో చేతికి తగిలితే తీసి చూచాడు—కొబ్బరికాయ ముక్కా, బొంత అరటిపండూ. అవి నోట్లో వేసుకుని నమిలేశాడు. ఏం లాభం? పాతికేళ్ల కుర్రవాడు, బ్రహ్మచారి—అతని ఆకలి కవి యేపాటి? వాటివల్ల శరభన్నకి క్షుద్బాధ యేమీ తగ్గకపోవడమే కాకుండా మరింత ఎక్కువైంది. ఒక్క ఉదుటున లేచి సత్రంవేపు వచ్చాడు. రైలుస్టేషను మాస్టరుగారి గదిలో ఒక దీపం సన్నగా వెలుగుతోంది స్టేషనులో మిఠాయి అమ్ముకునేవాడి దుకాణందగ్గర ఒక చిన్న కిరసనాయిలుబుడ్డి గాలిలో ఎప్పటికప్పుడు ఆరిపోయేదానిలాగ మినుకుమినుకు మంటోంది. ఉన్న నాలుగు ఇళ్లవాళ్లూ అప్పుడే తలుపులు బిగించుకున్నారు.

లోపలికి వెళ్లి శరభన్న తన చిన్న ఆముదందీపం వెలిగించుకుని కూర్చున్నాడు. ఆకలికి తాళలేకపోతున్నాడు. అన్నం వండుకోవాలి, తినాలి. అన్నం వండుకోవడం అంటే మాటలా? పొయ్యి రాజెయ్యాలి, బియ్యం కడగాలి, ఏదైనా ఒక పచ్చడి నూరాలి. మజ్జిగ లేదు. "కాస్త భోజనం పెట్టు తల్లీ" అని యే అమ్మనైనా యాచిద్దామంటే ఆపట్టెని బ్రాహ్మణగృహం లేదు. మిఠాయి దుకాణంలో ఏమన్నా తినడానికి వాడు గొల్లవాడు, వాడిచేతితిండి...ఛీ—పోః, ఆపద్ధర్మమనుకుందామా, వాడు వేరుశనగనూనెతో చేస్తాడవి. వికారం, వాంతులూ! బకాసురుడి జఠరంలాగ ఉంది ఆకలి. సరే, వంటయింట్లోకి వెళ్లి అక్కడ పొయ్యి రాజేసి బియ్యం పెట్టాడు. పొయ్యి మండడంలేదు. పొయ్యిలోనుంచి పొగ కళ్లల్లోకి పోయింది. శరభన్నకి మహాకోపం వచ్చింది. లేచి నుంచుని

పొయ్యిరాళ్లని ఒక్క తన్ను తన్ని "ఎంతసేపీవెధవవంట, భోజనం కావాలి నాకు" అన్నాడు గట్టిగా.

చెప్పాను కాదూ, మరుక్షణంలో అక్కడ ఒక అరటిఆకు పరచి ఉందనీ, దాంట్లో షడ్రసోపేతమైన భోజనం ఉందనీ, శరభన్న తన కళ్లని తాను నమ్మలేకపోయాడనిన్నీ. అంతలో జ్ఞప్తికి వచ్చిం దతనికి శ్యామలాదేవి ఒక వర మిచ్చినట్లు తనకు కలిగిన అనుభవం. "అది నిజమేనన్నమాట" అనుకుంటూ, అతను పరీక్షచేయాలని కాబోలు, "పీట ఏదీ" అన్నాడు. ఎక్కడినుంచి వచ్చిందో, నాల్గుమూలలా వెండిపువ్వులతో మిలమిలలాడుతూ, ముద్దులమూటగట్టే ఒక చక్కని టేకుపీట విస్తరిముందుకు వచ్చింది. శరభన్నకి ఇంకా నమ్మకం కలుగలేదు. "మంచినీళ్లు" అన్నాడు. తళతళలాడే వెండిచెంబుల జోడాతో వచ్చాయి మంచినీళ్లు శరభన్న ఆశ్చర్యపడుతూ పీటమీద కూర్చున్నాడు. భోజనం దేవికి నివేదనచేయడానికి అభిఘరించాలసి చూస్తే నెయ్యిలేదు.

"నెయ్యి?" అన్నాడు.

ఘుమఘుమలాడే నేతితో నిండిన వెండిగిన్నె ఒకటి హాజరైంది.

ఆపోశనంపట్టి ప్రాణాహుతులు చేసి విస్తట్లోవి అన్నీ నాలుకకు రాచుకొని చూచాడు. కూరలు బాగానే ఉన్నాయి. పచ్చళ్లూ బాగానే ఉన్నాయి. వాళ్ల అమ్మ బ్రతికి ఉన్నప్పుడు ఎప్పుడైనా చింతచిగురూ పప్పూ వండేది. అది తలపుకు వచ్చి అతను "చింతచిగురుపప్పు" అన్నాడు. దోరగా వేగిన మిరపకాయముక్కలతో, కొత్తిమిరి చింతచిగురు వాసనలతో, ఆవిరులు చిమ్ముతూ వచ్చిపడింది చింతచిగురు పప్పు. ఓహోహో! ఏమి రుచి, ఏమి రుచి!!

"పెరుగు?"

పెరుగు వచ్చింది. గట్టిగా కరళ్లు కట్టి, మీగడ జిడ్డుతో, పకిన ప్రత్తియొక్క తెలుపుతో, తియదనాలతో వచ్చింది పెరుగు. దానితో మళ్లీ మళ్లీ తిన్నాడు శరభన్న.

పెరుగూ అన్నం తింటూంటూనే వచ్చింది నిద్ర అతనికి. లేచి చేయి కడుక్కోవాలని అవతలికి వెడితే కొంచెంగా చలి వేసింది.

"వేణ్ణీళ్లు" అన్నాడు.

వెంటనే చక్కగా పాళాలుగా తొరిపిన ఒక కాగుడు వేణ్ణీళ్లు వచ్చాయి. వాటిలో చేతులూ, కాళ్లూ కడుక్కొని, అంగవస్త్రంతో తుడుచుకొని, మళ్లీ పీటమీద కూర్చుని విస్తరి దగ్గిర మెతుకులు ఎత్తడం మొదలు పెట్టాడు. నిద్ర వస్తోంది. భోజనం కడుపునిండా తిన్నతర్వాత విస్తరి యెత్తుకోవడం, శుద్ధి చేసుకోవడం చాలా బరువుగా తోచిం దతనికి. సగంవరకు మెతుకులు యెత్తిన తర్వాత ఉలికిపడి శరభన్న చెయ్యిజాడించి, "యెంగిలి పోవాలి" అన్నాడు. కళ్లు మూసి తెరిచేలోపల విస్తరి పోయింది, యెంగిలి పోయింది. ఆ వెండిచెంబుల జోడా, పీటా, నేతిగిన్నె మాత్రం అక్కడే ఉన్నాయి. "ఇవికూడా పోవాలి" అన్నాడు. తత్క్షణం అవన్నీకూడా మాయమైపోయాయి.

మళ్లీ సత్రంలోకి రాలేక చింకిచాపకు బదులు తన అంగవస్త్రమే పరుచుకొని పడు

కున్న నిముషంలోనే అతనికి ఒళ్లు తెలియని నిద్ర పట్టింది.........

మళ్లీ ఎందుకు తెలివి వచ్చిందో వచ్చింది. శరభన్న కళ్లు విప్పేసరికి చీకటి దట్టంగా ఉంది. అతని ఆముదందీపం ఆరిపోయింది. లేచి ఇవతలికి వచ్చి చూస్తే అంతా చీకటి. రాత్రి ఇంక వచ్చే రైళ్లు లేకపోబట్టి పడుకున్నాడు కాబోలు స్టేషనుమాస్టరుగారు, ఆయనగదిలోనూ దీపంలేదు మిఠాయి దుకాణంవాడి కిరసనాయిలుచిలక ఎప్పుడో ఆరిపోయింది. తన ఆముదం దీపం చేతితో పట్టుకొని సత్రంలోకి తెచ్చుకుని సిమ్మామీద పెట్టి, అది వెలిగించకుండానే గోడకు చేరబడి కూర్చుని వేళ్లు మెటికలు విరుస్తూ ఆలోచన మొదలు పెట్టాడు. అతని మనస్సులో ఒక విధమైన ఉత్సాహం, శరీరంలో ఒక విధమైన శక్తీ ద్యోతకమవుతున్నాయి అప్పటికి కొన్ని గంటలక్రింద తాను చూచిన అద్భుతవిషయాల్ని తలచుకుంటే అతనికి ఎంతో ఆనందం కలిగింది. అంతలో మళ్లీ సందేహం కలిగింది. అతను మళ్లీ తేరిపార చూచి, "దీపం వెలగాలి" అన్నాడు.

ఎవరూ వెలిగించకుండానే గుప్పున వెలిగింది ప్రమిదలోపలి ఆముదందీపం. అతనికి అంతులేని సంతోషం కలిగింది. మళ్లీ "దీపం వద్దు" అన్నాడు. దీపం టప్పున ఆరిపోయింది.

"దీపం" అన్నాడు తిరిగీ. సన్నజాజి మొగ్గలాగ సన్నగా వెలిగింది దీపం.

ఈ విధంగా ఒక వందపర్యాయములయినా ప్రయోగాలు చేసి చూచాడు శరభన్న. పలకలు, పలకపుల్లలు, పెద్దబాలశిక్షలు, పెన్సిళ్లు, సిరాబుడ్లు, వంటగిన్నెలు, ఉప్పులు, పప్పులు, ఎన్నో సృష్టించాడు. వాటిని మళ్లీ నాశనంచేశాడు. మళ్లీ దీపం మీద దృష్టిపడి, "నాకు గ్లాసులైటు కావాలి" అన్నాడు. తక్షణం వచ్చిపడింది గ్యాసులైటు ఆముదందీపంస్థానంలో. పట్టపగలు లాగ తెల్లటి వెలుతురు సత్రంగదిలో, అరుగు మీదా, సత్రంఆవరణలో చాలా దూరం వ్యాపించింది. నిజంగా గ్యాసులైటువునో కాదో అని చూచాడు శరభన్న. నిస్సందేహంగా అది గ్యాసులైటే. జంక్షను దగ్గరా, నూజివీడులోనూ ఉంటాయే, అల్లాటిదే. అవి పొగచూరుతూ ఉంటాయి గాని ఇది చక్కగా ఉంది.

తనశక్తిని చూచుకుంటే కలిగిన ఆనందం వల్ల అతడు పకపక నవ్వాడు. నవ్వి ఆ లైటును పొమ్మన్నాడు. అది పోయింది. "ఇప్పుడు తెల్లవారాలి" అన్నాడు.

[సశేషము]